

విత్తనాలు రాక.. మేత లేక!

గడ్డి విత్తనాల పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో మేతకోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు.


8లో▸



సాగు పెరిగింది..ధర తగ్గింది

స్వీట్‌కార్న్ సాగు పెరిగింది.. అనువైన నేలలు ఉండటం ... తక్కువ సమయంలో పంట చేతికి రావడం ..

9లో▸



న్యూస్‌రీల్

పరిహారం ఇవ్వట్లేదని పట్టాల తొలగింపు



రైల్వేట్రాక్‌ను తొలగిస్తున్న రైతులు తదితరులు

తాండూరు రూరల్: తెలంగాణ–కర్ణాటక సరిహద్దుల్లో కల్లూరు సమీపంలో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీకి తాండూరు మండలంలోని బెల్కటూర్, మిట్ట బాసుపల్లి, గుంతబాసుపల్లి, కోటబాసుపల్లి, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని పొలాల మీదుగా రెండేళ్ల క్రితం రైల్వేట్రాక్ నిర్మించారు. ఈ 11 కిలోమీటర్ల ట్రాక్‌కు పరిహారం చెల్లించాలని రైతులు జనార్ధన్‌రెడ్డి, కృష్ణవేణి, రాజారాం, శంకర్ కాంట్రాక్టర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. నేటికీ పరిహారం అందకపోవడంతో కాంట్రాక్టర్‌ను నిలదీశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.18కోట్ల వరకు బకాయి చెల్లించలేదని దీంతో పరిహారం ఆలస్యమైందని కాంట్రాక్టర్ రైతులకు చెప్పారు. దీంతో ఆగ్రహించిన రైతులు, కాంట్రాక్టర్లు కోటబాసుపల్లి శివారులోని సర్వేనంబర్ 68లో కార్మికుల సాయంతో ట్రాక్‌ను తొలగించారు. ఎన్నిసార్లు కోరినా చెట్టినాడు యాజమాన్యం పట్టించుకోవడం లేదని అందుకోసమే పట్టాలు తొలగించామని వారు వాపోయారు. గతంలో కాంట్రాక్టర్ రెండు సార్లు ఈ పట్టాలు తొలగించారు.

క్రమశిక్షణ, ఏకాగ్రతతో నేర్చుకోవాలి

ఎస్పీ కోటిరెడ్డి



శిక్షణ కానిస్టేబుల్స్‌కు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీ(టీఎస్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న 280 మంది మహిళ (శిక్షణ కానిస్టేబుళ్లు) ఎస్‌సీటీ పీసీ అభ్యర్థులు ఫంక్షనింగ్ ఆఫ్ డీపీఓ, రికార్డ్స్ మెయింటనెన్స్‌పై వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి అభ్యర్థులతో సమావేశమై మాట్లాడారు. శిక్షణ కాలంలో క్రమశిక్షణ, ఏకాగ్రతతో చెప్పే విషయాలను నేర్చుకోవాలన్నారు. ప్రతీ విషయాన్ని శ్రద్ధగా వినాలన్నారు. అనంతరం అభ్యర్థులకు ఏఓ జ్యోతిర్మనీ, ఏఆర్ డీఎస్పీ వీరేషం శిక్షణలో విషయాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఏ డీఎస్పీలు కృష్ణ, రవీందర్ రాజు, ఆర్‌ఐలు, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కుల్కచర్ల: మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 7న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6వ తరగతి ప్రవేశపరీక్ష ఉండగా.. మిగతా తరగతులకు మధ్యాహ్నం నిర్వహిస్తామని చెప్పారు.

బెట్టింగ్ జోరు.. యువత బేజారు

బెట్టింగ్ ఉచ్చులో యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటోంది. సులువుగా డబ్బు సంపాదించవచ్చనే అత్యాశలో పందెం కాస్తూ లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. ఇందుకు తెచ్చిన అప్పు తీర్చే మార్గం కానరాక కన్న తల్లిదండ్రులకు శోకం మిగిలిస్తున్నారు.

- అదేదారిలో కొంతమంది ఉద్యోగులు, నాయకులు
- పల్లెల్లకూ విస్తరించిన క్రికెట్ పందేలు
- యాప్‌లలో ఆన్‌లైన్ బెట్టింగ్స్
- లక్షల్లో అప్పులు.. తీర్చేందుకు తంటాలు



వికారాబాద్: ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన యువత బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుంటోంది. ఇప్పటికే గంజాయి లాంటి మాదక ద్రవ్యాల బారిన పడగా బెట్టింగ్ లాంటి వ్యసనాలతో కొట్టుమిట్టాడుతోంది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే యువకులు సైతం నెలల తరబడి కష్టపడి దాచుకున్న డబ్బు క్రికెట్ బెట్టింగులకు వెచ్చిస్తున్నారు. కొందరు భార్యల ఒంటిపై ఉన్న నగలు బెట్టింగ్ పెట్టి కాపురాలు కూల్చుకునే స్థాయికి దిగజారుతున్నారు. అయితే గంజాయికి అలవాటు పడిన యువతే ఈ బెట్టింగుల్లో సైతం ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నట్టు సమాచారం.. ఈ విషయంలో ఇప్పటికే పలు సార్లు జిల్లా పోలీసులు బెట్టింగులకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరికలు చేసినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం కొనసాగిస్తున్నారు.

చిన్నారుల నుంచి పెద్దల వరకు

గతంలో అడపాదడపా ఇండియా మ్యాచ్‌లు జరిగే సమయంలో క్రికెట్ బెట్టింగ్ పెట్టేవారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎ ల్) నేపథ్యంలో బెట్టింగ్‌లు మరింత ఊపందుకున్నాయి. ఒక్కో మున్సిపాలిటీ పరిధిలోరెండు మూడు వందలకు పైగా యువకులు, కొంతమంది ఉద్యోగులు పలువురు నాయకులు, ఈ బెట్టింగుల్లో పాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతీ మ్యాచ్‌కు లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. బెట్టింగ్ ఉచ్చులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోకముందే పోలీసులు నిఘా పెంచి యువత, విద్యార్థులను ఆ ఉచ్చులోంచి బయటపడేయాలని పలువురు కోరుతున్నారు. పాఠశాల వయసున్న చిన్నారులు సైతం రూ.10 మొదలుకుని రూ.100 వరకు పందెం కాస్తున్నారు. నిఘా పెడితే కొంతయినా ఫలితముంటుందని భావిస్తున్నారు.

ప్రత్యేక అడ్డాలు

గ్రూపులుగా ఏర్పడిన యువత అడ్డాలు ఏర్పాటు చేసుకుని క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారు. గ్రామాల నుంచి సైతం యువకులు బెట్టింగ్ కోసం వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ తదితర పట్టణాలకు వస్తున్నట్లు సమాచారం. టీ పాయింట్లు, హోటళ్లు, పట్టణాలకు కాస్త దూరంగా ఉండే వెంచర్లు, పాన్‌షాప్‌లు కొత్తగా ఏర్పడిన ఛాయ్ దుకాణాలు. బేకరీలను అడ్డాగా చేసుకుంటున్నారు. పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం బెట్టింగులో పాల్గొంటుండటం గమనార్హం. తమ పిల్లలు బెట్టింగులకు పాల్పడుతున్నారనే విషయం తెలిసినా తల్లిదండ్రులు బయటకు చెప్పలేక సతమతమవుతున్నారు.

కోడ్ లాంగ్వేజ్

క్రికెట్ బెట్టింగ్ రెండు తరహాల్లో సాగుతోంది. కొందరు యువకులు స్థానికేతరులతో సంబంధాలు ఏర్పర్చుకుని ఆన్‌లైన్ ద్వారా ఫోన్ సాయంతో బెట్టింగులకు పాల్పడుతున్నారు. ఇందుకు యాప్‌లను వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో కొన్ని యాప్‌లను నిషేధించగా వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. స్థానికంగానే పలువురు యువకులు గ్రూపులుగా మారి పలనా జట్టు గెలుస్తుందని కొందరు.. మరో జట్టు గెలుస్తుందని మరికొందరు బెట్టింగ్ పెడుతున్నారు. ఒక్కొక్కరు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు పందెం పెడుతున్నారు. ఇందులో కొందరు పెద్ద వారు, నాయకులు, రియల్టర్లు సైతం రూ. లక్షల్లో బెట్ కడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఫోన్‌లో పందెం కాసే సమయంలో ఎవరికి అనుమానం రాకుండా కోడ్‌లను ఉపయోగిస్తున్నారు.. దీనిపై అనుమానం రాకుండా వాట్సాప్ కాల్స్, మెసేజెస్ ద్వారా సమాచార మార్పిడి చేస్తూ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరికొందరు వికారాబాద్ వారు పరిగి వారితో, తాండూరు, కొడంగల్ వాళ్లతో, ఇలా ఒక ప్రాంతం వారు మారో ప్రాంతం వాళ్లతో కూడా ఈ బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘాపెడతాం

యువత కదలికలపై తల్లిదండ్రులు సైతం దృష్టిసారించాలి. బెట్టింగులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే హెచ్చరికలు చేశాం. బెట్టింగులకు వెళ్లి అనవసరంగా జీవితాన్ని పాడు చేసుకోవద్దు. సమాచారం సేకరించేందుకు నిఘా పెడతాం ఇందుకు ప్రజల సహకారం అవసరం.. ఎవరికైనా సమాచారం తెలిస్తే తెలపండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. యువతను బెట్టింగ్ భూతం నుంచి బయట పడేసేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– కోటిరెడ్డి, ఎస్పీ, వికారాబాద్



అనంతగిరి: పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న రాహుల్ శర్మ

నీటి సరఫరాపై సంతృప్తి

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అవసరం
- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమ వారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సరఫరాపై వివిధ కాలనీలను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి అసౌకర్యం రాకుండా బోర్‌వెల్స్, చేతిపంపులను మరమ్మతులు చేపట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో పర్యటించే క్రమంలో పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పలువురు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మరమ్మతులకు గురైతే బాగుచేయించండి

ధారూరు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కేరెల్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీ ఉల్లా, ఏపీఓ సురేశ్‌తో కలిసి పరిశీలించారు. రెండు గ్రామాల్లో ప్రజలను అడిగి నీటిసరఫరా విషయంలో సంతృప్తి వ్యక్తం చేశారు. బోర్‌వెల్స్, చేతి పంపుల పనితీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆయన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అని వార్య కారణాల వలన నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మరమ్మతులకు గురైన బోర్లు, చేతి పంపులను వెంటనే బాగుచేయించాలని సూచించారు. సర్పంచులు లేనందున ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి ప్రతిరోజు సందర్శించి తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని సూచించారు. ముందుగా ఆయన ఓవర్‌హెడ్ ట్యాంకులను, బోర్ల ను పరిశీలించి నీరు ప్రజలకు తగినంతగా సరఫరా చేస్తున్నారా అని కార్యదర్శులు రేవంత్‌కుమార్, రేఖను అడిగి తెలుసుకున్నారు. కేరెల్లిలోని చివరి కాలనీలో మిషన్ భగీరథ నీరు సరిపడా సరఫరా కాదని, బోరుద్వారా సింథటిక్ ట్యాంకులోకి నీటిని నింపి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల రిజిస్టర్లను పరిశీలించారు.



బషీరాబాద్: మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కారు, కాంగ్రెస్ పార్టీలతో మోసం

- మోదీ పాలనకే మళ్లీ పట్టం
- ప్రజా ఆశీర్వాద యాత్రలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: కారు, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా రాస్నం, పగిడియాల, బాగాయిపల్లి, రాఘవపూర్, కోకట్, లక్ష్మీనారాయణపూర్, చెన్నారం, జుంటుపల్లి, అగ్గనూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా మోదీకి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకుని మరోమారు బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డిని గ్రామీణ ప్రాంత ప్రజలు ఎవరూ గుర్తు పట్టరని కొండా ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, యు.రమేశ్‌కుమార్, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు జంగం యాదగిరి తదితరులు ఉన్నారు.

మోదీ పాలనే సురక్షితం

బషీరాబాద్: దేశానికి మోదీ పాలనే సురక్షితమని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని గొట్టిగకుర్దు, నవల్గా, పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్ తండా, మైల్వార్, ఎక్మాయి, మంతన్ గౌడ్, బషీరాబాద్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ప్రతీ ఒక్కరు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తననకు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రమేశ్‌కుమార్, నరేశ్ మహరాజ్, నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, మండల అధ్యక్షుడు రాఘవేందర్, సాహూ శ్రీలత, మనోహర్‌రావు, రాజ్‌కుమార్ కులకర్ణి, గంగాధర్, ప్రశాంత్ తదిరులు పాల్గొన్నారు.

ట్రైనర్స్ పూర్తి అవగాహనతో ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: మాస్టర్ ట్రైనర్స్‌కు ఎన్నికల విధులు, ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాస్టర్ ట్రైనర్స్‌కు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ రోజు నిర్వహించే విధులు, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను అమర్చడం, మాక్‌పోలింగ్ తదితర అంశాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. హ్యాండ్ బుక్‌లో సూచించిన విధంగా పోలింగ్ సామగ్రి సమకూర్చుకోవాలన్నారు. మాక్‌పోల్‌లో కనీసం 50 ఓట్లు వేయాలని.. నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ పూర్తయ్యాక ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ డిక్లరేషన్ ఇవ్వాలని తెలిపారు. చూపు లేని దివ్యాంగ ఓటర్లు సహాయకుడితో ఓటు వేసేందుకు ఫామ్ 14ఏ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే వారు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ సుధీర్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్నికల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రథమ స్థానం.. జిల్లాకు గర్వకారణం

ఉపాధి హామీ పథకంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులదే పూర్తి బాధ్యత వహించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ శ్రీనివాసులు, డీపీఓ జయసుధ, ఎంపీడీఓలు, ఏపీఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పీఓ, ఏపీఓల శిక్షణ షెడ్యూల్

నియోజకవర్గం	తేదీ	ప్రాంగణం
వికారాబాద్	ఏప్రిల్ 2, 3	బాలుర జూనియర్ కళాశాల
పరిగి	ఏప్రిల్ 2, 3	జెడ్పీహెచ్‌ఎస్ బాలుర
తాండూరు	ఏప్రిల్ 3, 4	జెడ్పీహెచ్‌ఎస్
కొడంగల్	ఏప్రిల్ 3, 4	జెడ్పీహెచ్‌ఎస్

'మండే'

- సుర్రుమన్న సూరీడు..
- పగలు భగభగలు..రాత్రి ఉక్కపోత
- సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదు
- మియాపూర్‌లో 41.7 డిగ్రీలు, కందుకూరులో 41.6 డిగ్రీలు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలో సోమవారం అత్యధికంగా 236 మెగావాట్ల విద్యుత్ వాడకం నమోదైంది. గతేడాది ఏప్రిల్ 1న కేవలం 158 మెగావాట్ల విద్యుత్ మాత్రమే వాడటం గమనార్హం. ఉదయం తొమ్మిది గంటలకే సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. తాజాగా సోమవారం మియాపూర్‌లో అత్యధికంగా 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కందుకూరు, చందానగర్, నాగోల్‌లో 41.6 డిగ్రీలు, చిలుకూరు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 41.5 డిగ్రీలు, ఇబ్రహీంపట్నంలో 41.5, డిగ్రీలు, షాబాద్, రాచలూరు, అత్తాపూర్ తదితర మండలాల్లో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతల చొప్పున రికార్డు అయ్యాయి.

మీటరు గిరగిర..

ఎండలకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రోజంతా ఆన్‌లో ఉండటం, సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతున్నాయి. ఫీడర్లు ట్రిప్పవుతుండటంతో పాటు కండకర్లు, ఇన్సులేటర్లు వేడికి పేలుతున్నాయి. సాయంత్రం ఐదు నుంచి తొమ్మిది గంటల మధ్య అత్యధిక డిమాండ్ నమోదువుతుండటం ఆందోళన కలిగిస్తుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో గత ఏడాది ఏప్రిల్ 1న 2,954 మెగావాట్లు నమోదు కాగా, తాజాగా సోమవారం 3,738 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.



నవాబ్ మహబూబ్ ఆలంఖాన్‌కు ఖర్జూర తినిపిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి

'ఇఫ్తార్' మతసామరస్యానికి ప్రతీక

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో వికారాబాద్ నియోజకవర్గంలోని ముస్లింలకు స్పీకర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసాద్ కుమార్ ముస్లింలకు ఖర్జూర ఇచ్చి ఉపవాసం విడిపించారు. ఈ విందులో సంఘ సేవలకు నవాబ్ మహబూబ్ ఆలంఖాన్, ముజాయిద్ ఆలం ఖాన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అజ్మతుల్లాఖాన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, సీనియర్ నాయకులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

- చేవెళ్ల నుంచి కాసానిని గెలిపించుకుందాం
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగంలా కొనసాగిందని.. ప్రతి ఒక్కరి గుండెల్లో కేసీఆర్ ఉన్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, దయానంద్‌గుప్తా, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేసింది కేసీఆర్ అన్నారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా జిల్లాకు సుపరిచితుడు, ఎంతో రాజకీయ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపిక చేశారని చెప్పారు. గతంలో రెండు సార్లు చేవెళ్ల ఎంపీ అభ్యర్థులుగా పంపించిన ఇద్దరిని ఈ గడ్డపై గెలిపించామని.. ఇప్పుడు కూడా ప్రతి కార్యకర్త కాసాని గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీల్లో ఏం అమలు చేసిందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని.. చేసిందేమిటో చెప్పాలన్నారు. చేవెళ్ల ఎంపీగా కాసాని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా పంపిద్దామన్నారు.

ఆశీర్వదించి గెలిపించండి

తనను ఆశీర్వదించి చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కోరారు. కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి అండతో చేవెళ్ల అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉంటానని తెలిపారు. అందరం కలిసి చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎం.ఆనంద్, డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు రాక.. మేత లేక!


పశువుల కోసం సాగు చేసిన జొన్న పంట

- పశుగ్రాసానికి తీవ్ర ఇక్కట్లు
- నిధుల లేమితో నిలిచిన గడ్డి విత్తనాల సరఫరా
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

దౌల్తాబాద్: గడ్డి విత్తనాల పంపిణీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో సరైన మోతాదులో మేత లభించక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో పశుపోషణ భారంగా మారిందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే గడ్డి విత్తనాలను సకాలంలో సరఫరా చేసుంటే ఈ దుస్థితి ఉండేది కాదని వారు భావిస్తున్నారు. మండలంలో 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రజలు కావడంతో పశువుల సంఖ్య బాగానే ఉంది. కానీ ఈసారి గడ్డి విత్తనాల పంపిణీని నిధుల లేమితో ప్రభుత్వం గాలికొదిలేసింది. అసలే విపరీతమైన ఎండలు దీనికితోడు నీటి వనరులు సైతం అడుగంటిన పరిస్థితుల్లో పశుగ్రాసానికి గడ్డుకాలం దాపురించిందని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు.

75 శాతం రాయితీ

మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో సుమారు 18 వేల పాడి పశువులు, 12 వేల మేకలు, గొర్రెలతో వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఏటా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తారు. ఇందుకోసం బడ్జెట్ కేటాయించి కొనుగోలు చేసి రైతులకు ఇస్తారు. ఈ విత్తనాలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో పశువైద్యశాలకు చేర్చి అక్కడి నుంచి అన్నదాతలకు రాయితీపై అందిస్తారు. అయితే ఈ ఏడాది రాయితీ విత్తనాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో పంపిణీ నిలిచిపోయినట్లు సమాచారం. యాసంగి ఆరంభంలో పంపిణీ చేసే గడ్డి విత్తనాలను వేసవిని దృష్టిలో ఉంచుకొని రైతులు సాగు చేస్తారు. తద్వారా పశుగ్రాసానికి కొరత రాకుండా ఉంటుంది. కానీ ఇప్పటివరకు గడ్డి విత్తనాలు పశువైద్యశాలకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు

గడ్డి విత్తనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ చర్యలు అన్వేషిస్తున్నారు. జొన్న, మొక్కజొన్న పంటల వైపు దృష్టి సారించారు. పొలంలో బోర్లు వేసి బిందు సేద్యం ద్వారా మొక్కజొన్న, జొన్న పంటలను పండిస్తున్నారు. బోర్లు ఉన్నవారు ఎలాగైనా తమ పశువులను కాపాడుతుంటే.. వర్షాధారిత పంటల రైతులు మాత్రం బయటి నుంచి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ విషయమై పశువైద్యశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డిని వివరణ కోరగా.. ఈ సంవత్సరం బడ్జెట్‌లో విత్తనాలు రాలేదు. రైతులు కూడా ప్రతి రోజు వచ్చి అడుగుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని ఆయన వివరించారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు రావొద్దు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట: వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, వ్యవసాయ అధికారులు, ఐకేపీ సిబ్బంది, రైతుసంఘాల నాయకులతో మాట్లాడారు. వరిధాన్యంలో 17శాతం తేమను పరీక్షించి కొనుగోలు చేయాలన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడు రూ.2,203, బీ గ్రేడు రూ.2,183 ప్రభుత్వం మద్దతు ధర అందిస్తోందన్నారు. గన్నిబ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. వరిధాన్యం అమ్మేందుకు రైతులు భూమిపట్టా పాసుబుక్, బ్యాంకు ఖాతా జిరాక్సు, ఆధార్‌కార్డు, ఏఈఓ పంట సాగు ధ్రువీకరణ పత్రం తీసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రానికి రావాలన్నారు. ఇందులో డీఎస్‌ఓ రాజేశ్వర్, డీఎం సుగుణాబాయి, డీపీఎం రాంరెడ్డి, సివిల్ సప్లై లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దారు రవి, ఏఓ తిప్పేస్వామి, ఏఈఓ రేణుక, వీఓఏ రాంచంద్రయ్య, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంగీత తదితరులున్నారు.

చేపల వేటకు వెళ్లి.. వ్యక్తి గల్లంతు

కొనసాగుతున్న గాలింపు చర్యలు

అనంతగిరి: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయిన సంఘటన సోమవారం వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుకల చిన్న అనంతయ్య(60) చేపల కోసమని చెరువులోకి వెళ్లాడు. ఈక్రమంలో ఈత కొడుతూ ముందుకు వెళ్తున్న క్రమంలో అనంతయ్యకు ఊపిరి ఆడక ఒక్కసారిగా చెరువులో మునిగాడు. ఇది గమనించిన గ్రామస్తులు వెంటనే కాపాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయగా గాలింపు చర్యలు చేపట్టారు. కోట్‌పల్లి నుంచి బోట్ తెప్పించడంతో పాటు గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలింపు చేపట్టినా రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. కాగా అనంతయ్య కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు.


చెరువులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

కసాయి కొడుకు కర్కశత్వం

- ఆస్తి కోసం తండ్రి గొంతు కోసిన తనయుడు
- బీరోల్‌లో ఘటన

బంట్వారం: ఆస్తి కోసం కన్న తండ్రి గొంతు కోశాడో కసాయి కొడుకు. ఈ సంఘటన సోమవారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని బీరోల్ గ్రామంలో చోటుచేసుకుంది. కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. తాండ్ర అంతయ్య (53)కు రెండెకరాల లావుణి పట్టా వ్యవసాయ భూమి ఉంది. ఈయన భార్య ప్రమీల, కూతురు తులసితో కలిసి వికారాబాద్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కుమారుడు రమేశ్(వివాహం కాలేదు) తాగుడుకు బానిసయ్యాడు. గతంలోనే తండ్రి పేరున ఉన్న ఎకరం పట్టా భూమిని అమ్ముకున్నాడు. ఇతని వేధింపులు తట్టుకోలేక అంతయ్య వికారాబాద్‌కు మకాం మార్చారు. ప్రస్తుతం ఉన్న లావుణి భూమిని సైతం విక్రయించేందుకు తండ్రిని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తండ్రిని వికారాబాద్ నుంచి ఆటోలో బీరోల్‌కు తీసుకెళ్లాడు. గ్రామ శివారులో ఆటో ఆపిన రమేశ్ కత్తితో గొంతు కోసి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో రోడ్డు పక్కన పడి ఉన్న బాధితుడిని గుర్తించిన స్థానికులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భార్య ప్రమీలకు సమాచారం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమీల ఫిర్యాదు మేరకు కొడుకు రమేశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్రవంతి తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంతయ్య

నీట మునిగి చిన్నారి మృతి

కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు


శౌర్య మృతదేహం

యాలాల: ముక్కుపచ్చలారని ఓ చిన్నారిని తటాకం దిగమింగిది. దీంతో మమకారంగా చూసుకుంటున్న తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాదవశాత్తు ఓ ఆరేళ్ల బాలిక చెరువులో మునిగి మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల అనంతమ్మ కూతురు కవిత వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌తో వివాహామైంది. వారం రోజుల క్రితం కవిత భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె రెండో కూతురు శౌర్య(6) గ్రామ శివారులోని చెరువు కట్టపై ఆడుకుంటుంది. కాగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడింది. గమనించిన స్థానికులు చిన్నారిని చెరువులోంచి బయటికి తీసి తాండూరులోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లోని పరుపుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీలో కొన్ని నెలలుగా పరుపులు తయారు చేస్తున్నారు. సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన యజమాని యాకుత్ అందరిని అప్రమత్తం చేయగా అప్పటికే అతడి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే పరుపుల తయారీ సామగ్రి మొత్తం కాలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడిపై కత్తితో దాడి

హత్యాయత్నం కేసు నమోదు

మొయినాబాద్: డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడి తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన మండల పరిధిలోనిమేడిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్, రాఘవేందర్ ఇద్దరు అన్నదమ్ములు. వీరిద్దరూ తరచూ గొడవ పడేవారు. కాగా ఆదివారం రాత్రి డబ్బుల విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన రమేశ్ కత్తితో తమ్ముడిపై దాడి చేసి కడుపులో మూడుసార్లు పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలైన రాఘవేందర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. తన భర్తను చంపాలనే కుట్రతోనే రమేశ్ కత్తితో పొడిచాడని భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువతితో అసభ్య ప్రవర్తన

మణికొండ: కిరాణ దుకాణానికి వెళ్లి ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించటంతో పాటు ఆమెపై ఓ యువకుడు బకెట్‌తో నీళ్లు పోసి వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. ఇదేమిటని అడిగినందుకు సదరు యువతి తండ్రి గొంతు కోసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న అతడి భార్య చేతికి గాయామైంది. నెమలినగర్‌లోని జేఎన్‌ఎన్‌ఆర్‌ఎంయు క్వార్టర్స్‌లో రాముడు కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సురేష్ జులాయిగా ఉంటూ అసభ్యంగా ప్రవర్తించాడు.

14 కిలోల గంజాయి పట్టివేత


గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు


తాండూరు టౌన్: గంజాయితో పట్టుబడిన నిందితుడు

అనంతగిరి: గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 14 కిలలో స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారంతో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు వ్యక్తులు నుంచి రూ.3.50 లక్ష ల విలువ గల 14 కిలోలు గంజాయిని పట్టుకున్నారు. సరఫరా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో రైల్వే సీఐ వెంకటరత్నం, ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

తాండూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న కారణంగా ఓ వ్యక్తిని సోమవారం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ యూనస్ అనే డ్రైవర్ గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ సంతోష్ కుమార్ నేతృత్వంలో సిబ్బందితో కలిసి విలియం మూన్ చౌరస్తాలో పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.50వేల విలువ గల రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని కర్ణాటకలోని బీదర్ నుంచి తాండూరుకు తెచ్చి విక్రయిస్తున్నాడు. ఈమేరకు యూనస్‌పై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రెక్కీ చేసి.. ఇల్లు లూటీ

- తీర్థయాత్రకు వెళ్లి వచ్చేసరికి చోరీ
- 5 తులాల బంగారం, 120 తులాల వెండి, రూ.3.50 లక్షల నగదు అపహరణ

మొయినాబాద్: దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికే దుండగులు ఇళ్లంతా గుల్ల చేశారు. రెండుసార్లు రెక్కీ నిర్వహించి భారీ ఎత్తున నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాకారంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రాయనోళ్ల ఉపేందర్ గత నెల 30న కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి దేవస్థానానికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి దుండగులు ప్రహరీ గోడ దూకి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి 5 తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలు, రూ.3.50 లక్షల నగదు లూటీ చేశారు. ఇదంతా ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆదివారం రాత్రి ఉపేందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి, కబోర్డు తాళాలు పగలగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు. బంగారు, వెండి నగలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


దుండగులు తెరిచిన కబోర్డు

ముందస్తు పథకం ప్రకారం

లూటీకి సంబంధించి దృశ్యాలన్నీ ఇంటికి అమర్చిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. అందులో రెండుసార్లు రెక్కీ చేశారు. దుండగులు మొదట సీసీ కెమెరాలు ఉన్నాయని గుర్తించారు. ఈ క్రమంలో హార్డ్‌డిస్క్ తస్కరిద్దామని ఇంటర్‌నెట్ బాక్స్‌ను తీసుకెళ్లారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రఘునందన్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట సమీపంలోని సింగిల్ విండో కార్యాలయం గోదాంలో ఏర్పాటు చేసిన పభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ రఘునందన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధరను కల్పించడం జరుగుతుందని అన్నారు. అన్నదాతలు దళారులను నమ్మి తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడు రకం వరిధాన్యం క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యాలయం సిబ్బంది హరికృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం వద్ద సీఈఓ రఘునందన్

క్లుప్తంగా

శోభాయమానంగా శకటోత్సవం


ప్రత్యేకపూజలందుకున్న ఉత్సవమూర్తి

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం శకటోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. భక్తులు ఎండ్లబండ్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలతో స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నర్సమ్మరాములు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సొంత ఊరికి వచ్చి వెళ్తూ.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: సొంత ఊరికి వచ్చి వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చరకల్ గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి(70) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం బాలకృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై కుచ్చరకల్‌కువచ్చి సాయంత్రం తిరిగి కర్మన్‌ఘాట్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో బైపాస్‌లోని అనూస్ జంక్షన్ వద్దకు రాగానే ఆయన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణారెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఉపాధి కల్పనకు కృషి

జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణారావు


ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న కృష్ణారావు, సీఈఓలు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఇంకూబేషన్ యాక్సిలరేషన్ సమావేశం జేబీ గ్రూప్ విద్యా సంస్థల్లో నిర్వహించడం సంతోషకరమని ఆ సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు అన్నారు. మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలో జేబీ విద్యా సంస్థల్లో సోమవారం టీ-హబ్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర ఇంకూబేషన్ యాక్సిలరేషన్ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27 కంపెనీల సీఈఓలతో పాటు ఇంకూబేషన్ సంస్థ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కార్యదర్శి కృష్ణారావుతో ఒప్పందం నిర్వహించి సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి దిశలో భాగంగా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని సూచించారు. వీటికి ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేబీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమాచారి, డాక్టర్ సృజన, ఆయా కళాశాలల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



కృష్ణాజలం.. వృథాపర్వం

యాచారం: ప్రస్తుతం మండుతున్న ఎండలకు జల వనరులన్నీ ఆవిరవుతున్నాయి. ఈ దశలో నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం అధికార యంత్రాంగంపై ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే కృష్ణాజలాల పైపులకు లీకేజీలు ఏర్పడ్డాయి. మండలంలోని సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద కృష్ణాజలాల పైపుల నుంచి తాగునీరంతా వృథాగా పోతోంది. నాగార్జునసాగర్ నుంచి ప్రత్యేక పైపుల ద్వారా నగరంతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలకు కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నారు. అధికారులు పైపులకు మరమ్మతులు చేసి వేసవిలో నీటి ఎద్దడి నుంచి ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద పైపులకు ఏర్పడ్డ లీకేజీలు

గుర్తు తెలియని మహిళ మృతి

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని రామంతపురం గేటు సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతపురం బస్‌స్టేజీ సమీపంలో స్థానికులు గుర్తు తెలియని మహిళా మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవి పందుల బెడదకు చర్యలు

సూచించిన ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సునీత

కొందుర్గు: కొద్దిపాటి మెళకువలు పాటిస్తే అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సునీత తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న, జొన్న, చెరుకు, వేరుశనగ, వరి తదితర పంటల్ని అడవిపందులు తీవ్రంగా నాశనం చేసి రైతులను నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ.. పందులకు వాసనను పసిగట్టే గుణం అధికంగా ఉంటుంది. అయితే పంది కొవ్వు, పేడ పంట పొలాల చుట్టూ ఉంచితే పందులు పంటలోకి రాకుండా నియంత్రించవచ్చు. పొలం చుట్టూ వెంట్రుకలు ఉంచితే, పందులు శ్వాస తీసుకునే సమయంలో ముక్కులోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అదేవిధంగా వాడేసిన చీరలు చుట్టూ కంచెలా ఏర్పాటుచేయాలి. హెచ్‌డీపీ నైలాన్ నెట్ మూడు అడుగుల ఎత్తువరకు పొలం చుట్టూ అమర్చాలి. అలాగే నేలపై పరవాలి. దీంతో పంది కాళ్ల గిట్టలకు తగిలి వెనక్కి పోతుంది. సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతోపాటు నార్మల్ సౌండ్స్ వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట పొలం చుట్టూ నాలుగైదు వరుసల ఆముధం, సజ్జ, కుసుమ పంటలను సాగుచేయాలి. పొలాల చుట్టూ కందకాలు తీయడం, సోలార్ ఫినిషింగ్ ఏర్పాటు చేయడంతో పందుల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఆమె సూచించారు.


బైరంపల్లిలో రైతు సాగుచేసిన మొక్కజొన్న పంట